ప్రజాశక్తి

బుధవారం 8 మే 2024

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

లూటీదారులను సాగనంపండి

- ఏజెన్సీలో బిజెపి, తొత్తు, పొత్తు పార్టీలను ఓడించండి
- సిపిఎం, ఇండియా బ్లాక్ ప్రచార సభల్లో బృందాకరత్
- అరకు నియోజకవర్గంలో ఉత్సాహంగా రోడ్డుషో, బహిరంగ సభలు



అరకులోయలో నిర్వహించిన భారీ ర్యాలీలో బృందాకరత్, అప్పలనర్స, గంగాధర్‌స్వామి, లోకనాథం, నర్సింగరావు, సురేంద్ర, సిపిఎం, కాంగ్రెస్ కార్యకర్తలు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, అనంతగిరి, అరకులోయ, ముంచంగిపుట్టు విలేకరులు

ఏజెన్సీని లూటీ చేస్తున్న బిజెపిని, దాని పొత్తు, తొత్తు పార్టీలను ఈ ఎన్నికల్లో ఓడించాలని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్ పిలుపునిచ్చారు. ప్రజాగళం వినిపించే సిపిఎం, ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని కోరారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అనంతగిరి, అరకు, ముంచంగిపుట్టుల్లో ఇండియా వేదిక బలపరిచిన అరకు సిపిఎం లోక్‌సభ అభ్యర్థి పి.అప్పలనర్స, అరకు కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి శెట్టి గంగాధర్ స్వామికి మద్దతుగా మంగళవారం జరిగిన రోడ్డుషో, బహిరంగ సభల్లో ఆమె పాల్గొన్నారు. సంప్రదాయ నృత్యాలు, డప్పుల వాయిద్యాలతో గిరిజనులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. అనంతగిరిలో మహిళలు ఆమెకు బొట్టు పెట్టి తమ అభిమానం చాటుకున్నారు. అరకు పెట్రోల్ బంక్ నుంచి పోలీస్ స్టేషన్ మీదుగా సిపిఎం, కాంగ్రెస్ కార్యకర్తలు నిర్వహించిన ర్యాలీ అరకు బస్ కాంప్లెక్స్ జంక్షన్‌కు చేరుకుంది. ర్యాలీ అగ్రభాగాన బృందాకరత్, ఇండియా వేదిక బలపర్చిన అరకు లోక్‌సభ సిపిఎం అభ్యర్థి పి.అప్పలనర్స, అరకు కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి శెట్టి గంగాధర్ స్వామి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, కిల్లో సురేంద్ర, సీనియర్ నాయకులు సిహెచ్.నర్సింగరావు తదితరులు ఉన్నారు. ముంచంగిపుట్టులో తహశీల్దార్ కార్యాలయం రోడ్డు నుంచి సుజనకోట జంక్షన్ వరకూ రోడ్డుషో సాగింది. చినుకులు పడినా కార్యకర్తలు ఎర్ర జెండాలు పట్టుకొని సభ పూర్తయ్యే వరకు వున్నారు. ముంచంగిపుట్టు జంక్షన్ వద్ద బృందాకరత్ రాసిన రీటా పాఠాలు పుస్తకాన్ని ప్రదర్శించి, ఆమెకు వెల్కం టు రీటా, ఉయ్ లవ్ రీటా అని ప్ల కార్డులతో విద్యార్థులు స్వాగతం పలికారు. ఆయా చోట్ల జరిగిన సభల్లో బృందాకరత్ మాట్లాడుతూ యుపిఎ-1 ప్రభుత్వంపై వామపక్షాలు ఒత్తిడితెచ్చి సాధించిన అటవీ హక్కుల చట్టాన్ని నిర్వీర్యం చేసేలా మిగతా 2లో..

టిడిపికి ఓటేస్తే

ఉక్కు అమ్మకానికి ఆమోదం తెలిపినట్టే

- బాబుపై ప్రశంసలతో రాజకీయాల స్థాయి దిగజార్చిన మోడీ
- గాజువాక ఎన్నికల సభలో జగన్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో/ గాజువాక

ఈ ఎన్నికల్లో ఎన్‌డిఎ కూటమిలోగల తెలుగుదేశం పార్టీకి గాజువాకలో ఓటేస్తే స్టీల్‌ప్లాంట్ అమ్మకానికి ఆమోదం తెలిపినట్టేనని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వెల్లడించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం వైసిపి విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్‌లకు మద్దతుగా పాత గాజువాక జంక్షన్‌లో జరిగిన బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో తరలివచ్చిన జనాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ఎన్నికల ముందు ఎన్‌డిఎ కూటమి నేతలు ఈప్రాంత ప్రజలపై కపట ప్రేమ నటిస్తున్నారన్నారు. విశాఖలో ఏర్పాటు చేయదలచిన రైల్వే జోన్‌పైగానీ, వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌పైగానీ సోమవారం అనకాపల్లి జిల్లా కశింకోటలో జరిగిన ఎన్‌డిఎ కూటమి సభలో ప్రధాని మోడీ ఎందుకు నోరు విప్పలేదని జగన్ ప్రశ్నించారు. 2019లో చంద్రబాబును అవినీతిపరుడు అంటూ తూలనాడిన మోడీ 2024లో ఎన్‌డిఎలో చేరాడని చెప్పి కొనియాడడం చూస్తే రాజకీయాల స్థాయి ఇంతగా దిగజారిపోయిందా ? అని తనకు ఆశ్చర్యం వేసిందని అన్నారు. తాము మళ్లీ గెలిస్తే ఉక్కును పరిరక్షిస్తామని హామీ ఇచ్చారు. గాజువాక వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి అమర్‌నాథ్ మాట్లాడుతూ తన తాత, తండ్రి ఈ ప్రాంతానికి సేవ చేశారని తెలిపారు. తాను గెలిస్తే స్థానిక సమస్యలను పరిష్కరిస్తానన్నారు. తమ ప్రభుత్వం 2019లో ప్రకటించిన మ్యానిఫెస్టోలోని మిగతా 2లో..



గాజువాక సభలో మాట్లాడుతున్న జగన్

బిజెపి ఓటమితోనే దేశానికి సుస్థిరత

▶ వార్త 6లో..

పోలింగ్ కేంద్రాల్లో పూర్తి సౌకర్యాలు

▶ వార్త 8లో..

ఎన్‌టిపిసికి అపెక్స్ ఇండియా ప్లాటినం అవార్డు

▶ వార్త 8లో..



అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పిస్తున్న యువకులు

అల్లూరికి ఘన నివాళి

వాడవాడలా శత వర్ధంతి కార్యక్రమాలు

వార్తలు 7లో..

జగ్గునాయుడు విజయాన్ని కాంక్షిస్తూ..

రేపు గాజువాకలో సిపిఎం భారీ బైకు ర్యాలీ

- ముఖ్య అతిథిగా బివి.రాఘవులు రాక

ప్రజాశక్తి - గాజువాక : ఇండియా వేదిక బలపరిచిన సిపిఎం గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.జగ్గునాయుడు విజయాన్ని కాంక్షిస్తూ గాజువాక నియోజకవర్గంలో ఈ నెల 9న భారీ బైకు ర్యాలీ జరుగనుంది. దీనికి ముఖ్య అతిథిగా ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు హాజరుకానున్నారు. బైకు ర్యాలీ గురువారం ఉదయం 6 గంటలకు జింక్ గేటు దగ్గర ప్రారంభమవుతుందని, సాయంత్రం 6 గంటలకు కూర్మన్నపాలెంలో ముగుస్తుందని ఆ పార్టీ నేతలు మంగళవారం ఓ



ప్రకటనలో తెలిపారు. ర్యాలీలో కాంగ్రెస్ విశాఖ ఎంపీ అభ్యర్థి పి.సత్యారెడ్డి సహా ఇండియా వేదికలోని సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్, ఆమ్‌ఆద్మీ పార్టీల నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నట్టు వెల్లడించారు.

చందనోత్సవ ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయండి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి చందనోత్సవం కార్యక్రమంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా అవసరమగు సౌకర్యాలను త్వరితగతిన కల్పించాలని జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని తన ఛాంబర్‌లో జివిఎంసి అదనపు కమిషనర్ కెఎస్.విశ్వనాధన్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి చందనోత్సవ కార్యక్రమం ఏర్పాట్లుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మే 10వ తేదీన జరిగే శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుండి లక్షలాదిమంది భక్తులు వస్తారని, వారికి ఎటువంటి ఇబ్బందీ కలగరాదని అన్నారు. భక్తులకు తాగునీరు, ఒఆర్ఎస్ ప్యాకెట్లు సమృద్ధిగా అందించాలని, మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..



అనంతగిరిలో బృందాకరత్‌కు తిలకందిద్ది స్వాగతం పలుకుతున్న మహిళలు

టూరీదారులను సాగనంపండి

అటవీ సంరక్షణ చట్టాన్ని మోడీ ప్రభుత్వం సవరించిందని తెలిపారు. బిజెపి ఆదివాసీలకు చేసిన ద్రోహాన్ని వివరించారు.

నకిలీ ఎస్‌టి కొత్తపల్లి గీతను ఓడించండి : లోకనాథం

సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ అరకు బిజెపి ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీత నకిలీ గిరిజనరాలని, ఆమెను ఆదివాసీలు ఓడించాలని పిలుపునిచ్చారు. పదేళ్లుగా ఈ ప్రాంతం నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు, ఎంపీలు ఏనాడూ ఏజెన్సీ సమస్యలపై చట్టసభల్లో అడగలేదన్నారు. ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్న కొత్తపల్లి గీత బ్యాంకును కూడా టూరీ చేశారన్నారు. కాఫీ రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యారని తెలిపారు.

ఏజెన్సీని కొల్లగొట్టేందుకు కుట్రలు : సిహెచ్.నర్సింగరావు

సిపిఎం సీనియర్ నాయకులు సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ ఏజెన్సీలో ఖనిజ సంపదను దోపిడీ చేయడానికే బిజెపి అరకు లోక్‌సభకు తన అభ్యర్థిని నిలిపిందన్నారు. మోడీ మళ్లీ గెలిస్తే ప్రతి ఆదివాసీ గ్రామం ఒక మణిపూర్ అవుతుందని ఆందోళన వ్యక్తంచేశారు.

ఆదివాసీలకు తీవ్ర అన్యాయం : పి.అప్పలనర్స

సిపిఎం అరకు ఎంపీ అభ్యర్థి పి.అప్పలనర్స మాట్లాడుతూ బిజెపి పాలనలో ఆదివాసీలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఏజెన్సీలో అదానీ ఏజెంట్లుగా పనిచేస్తున్న బిజెపి, వైసిపి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను ఓడించాలన్నారు. నకిలీ గిరిజనులకు టికెట్లు కేటాయించడం వల్ల అసలైన ఆదివాసీలకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. భారత రాజ్యాంగ పరిరక్షణకు పాటుపడే ఇండియా వేదిక అభ్యర్థులను బలపర్చాలన్నారు. బాక్సైట్‌కు వ్యతిరేకంగా పోరాటం చేసిన ఘన చరిత్ర సిపిఎందేదన్నారు.

బిజెపి, వైసిపిలు గెలిస్తే ఆదివాసీ ప్రాంతం నాశనం : గంగాధర్‌స్వామి

సభలో కాంగ్రెస్ అరకు ఎమ్మెల్యే అభ్యర్థి శెట్టి గంగాధర్ స్వామి మాట్లాడుతూ ఆదివాసీ ప్రాంతంలో వైసిపి, బిజెపిలు గెలిస్తే ఈ ప్రాంతమంతా నాశనమవుతుందన్నారు. జగన్మోహన్ రెడ్డి, నరేంద్ర మోడీ ప్రభుత్వాలు వస్తే ఈ ప్రాంతంలోని భూములన్నీ అమ్మేస్తాయన్నారు.

ఆయా చోట్ల జరిగిన సభల్లో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర, అనంతగిరి జెడ్‌పిటిసి డి.గంగరాజు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు పి.శాంత కుమారి, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు, పొద్దు బాలదేవ్, పోతురాజు, టోకూరు సర్పంచ్ మొస్య, నాగులు, కె.గోవిందరావు, కొర్రా త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపికి ఓటేస్తే.. ఉక్కు అమ్మకానికి ఆమోదం తెలిపినట్టే

99 శాతం అంశాలను నెరవేర్చిందన్నారు.

అమ్మకం ఆపింది జగనా ? కార్మిక పోరాటాలా ?

వైసిపి అధినేత ప్రసంగంపై చర్చ

గాజువాక ఎన్నికల సభలో జగన్ మాట్లాడుతూ తాను సిఎంగా రాష్ట్రంలో కుర్చీలో కూర్చొన్నందున ప్రైవేటీకరణ, అమ్మకం ఆగాయని ఏకపక్షంగా ప్రకటించడంలో నిజం 'నేతి బీరకాయలో నేయి' చందంగా ఉంది. ప్రధాని మోడీ, నిర్మలాసీతారామన్ స్టీల్‌ప్లాంట్‌ను నాలుగేళ్ల క్రితం 100 శాతం స్ట్రాటజిక్ సేల్ చేస్తామని ప్రకటించిన నుంచీ విశాఖ కార్మికవర్గం, ప్రజా సంఘాలు, సిపిఎం, సిపిఐ, ఇతర వామపక్షాలు, ఉక్కు కార్మిక సంఘాలు పెద్ద ఎత్తున అలుపెరగని పోరాటాలు చేస్తూనే ఉన్నాయి. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ద్వారా నిరంతర ఉద్యమాలతో ఇటు ఎపి, అటు తెలంగాణ తెలుగు ప్రజల్లో ఉక్కు రక్షణ పోరాటం చర్చనీయాంశంగా మారింది. దేశంలోని కార్మికవర్గం మోడీ ప్రైవేటీకరణ విధానాన్ని తూర్పారబడుతూ వస్తోంది. కేవలం అసెంబ్లీలో తీర్మానం చేసి చేతులు ముడుచుకుని కూర్చొన్న వైసిపి ప్రభుత్వం 2024 ఎన్నికలు వారం రోజులుండగా వచ్చి గాజువాకలో సిఎం జగన్ సభ పెట్టి తన వల్లే అమ్మకం ఆగిందని చెప్పడం దారుణమని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఉత్తరాంధ్ర, విశాఖ కార్మికవర్గం చేస్తున్న పోరాటాలను కప్పిపుచ్చేలా సిఎం ప్రసంగం చేయడంపై సభకు హాజరైన కొంతమంది జనంలో చర్చ జరిగింది. ఎన్‌డిఎ కూటమిలోని టిడిపికి గాజువాకలో ఓటేస్తే అమ్మకం ముందుకెళ్తుందనడంలో ఎలాంటి సందేహమూ ఉండాల్సిన అవసరం లేదుగానీ.. తానే ఆపేశానంటూ జగన్ ప్రగల్భాలు పలకడంపై జనం నివ్వెరపోతున్నారు.

చందనోత్సవ ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయండి

కొండపైన, కొండ దిగువున పలు ప్రాంతాలలో మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేసి, వాటికి నిరంతరం నీరు అందించేలా చర్యలు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. భక్తులకు రహదారి మార్గంలో ఎటువంటి అసౌకర్యమూ కలుగకుండా విద్యుత్ దీపాల ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో ప్రధాన ఇంజినీరు రవికృష్ణంరాజు, డాక్టర్ వై.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ఊసేదీ ?

మోడీపై మంత్రి బొత్స ధ్వజం

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ: అనకాపల్లి జిల్లాలో జరిగిన సభలో ప్రధాని మోడీ స్టీల్‌ప్లాంట్‌పై ఊసే ఎత్తలేదని మంత్రి బొత్స సత్యనారాయణ విమర్శించారు. ఎవరో ఇచ్చిన స్క్రిప్ట్ ను మోడీ చదివారని, రైల్వే జోన్ పై అవగాహన లేకుండా మాట్లాడారన్నారు. లాసన్స్ బే కాలనీలో వైసీపీ ఎంపి.అభ్యర్థి బొత్స ఝాన్సీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, స్టీల్ ప్లాంట్ కోసం మాట్లాడకుండానే మెడీ వెళ్లిపోయారని విమర్శించారు. బీజేపీ చేస్తున్న అవినీతి దేశ చరిత్రలో ఏ పార్టీ చేయలేదన్నారు. తన రాజకీయ జీవితంలో బీజేపీ అంత అవినీతి పార్టీని ఎప్పుడూ చూడలేదన్నారు. కూటమి నేతల ఆలోచనలు దుర్మార్గంగా ఉన్నాయని, పింఛన్లు అడ్డుకోవడంతో సుమారు 30 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారని మంత్రి బొత్స సత్యనారాయణ విమర్శించారు.కూటమి పార్టీలు వైసీపీ ప్రభుత్వ పథకాలను అడ్డుకుంటున్నాయన్నారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను కూడా అడ్డుకుంటున్నారని విమర్శించారు. నిధులు సిద్ధం చేసినప్పటికీ పథకాల లబ్ధిని అందకుండా అడ్డుకుంటున్నాయని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. 2019 ఎన్నికలకు ముందు టీడీపీ పసుపు కుంకుమ ఇచ్చిందని తాము అడ్డుకోలేదని తెలిపారు.టీడీపీ ఆపించిన పథకాలకు నిధులు సిద్ధంగా ఉన్నాయని, ఎన్నికలు అయిన వెంటనే లబ్ధిదారుల ఖాతాల్లో జమ అవుతాయన్నారు.

ఎన్నికల్లో అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: ఎన్నికల ప్రక్రియలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర చాలా కీలకమని, వారు ప్రతి అంశాన్ని సునిశితంగా పరిశీలించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎ.మల్లికార్జున, సాధారణ పరిశీలకులు అమిత్ శర్మ తెలిపారు. స్థానిక ఉడా చిల్డ్రన్ ఎరీనాలో మంగళవారం జరిగిన ఒక్క రోజు శిక్షణ సదస్సులో మైక్రో అబ్జర్వర్లను ఉద్దేశించి వారు మాట్లాడుతూ, పలు అంశాలపై మార్గనిర్దేశం చేశారు. పోలింగ్ రోజున చాలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అక్కడ పరిస్థితులను గమనించి నివేదించాలని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగడానికి మైక్రో అబ్జర్వర్లు ముఖ్య పాత్ర పోషించాల్సి ఉంటుందని, దీనిని గుర్తు పెట్టుకొని బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు తప్పకుండా పాటించాలని, ఇందుకు సంబంధించిన అంశాలను నివేదించడానికి మాత్రమే మొబైల్ ఫోన్ వినియోగించాలని సూచించారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, డీఈవో చంద్రకళ మాట్లాడారు.

ఉద్యోగులకు మేలు

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ: ఉద్యోగులకు మేలు చేసిన ఘనత సిఎం జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందని ప్రభుత్వ ఉద్యోగులు సంక్షేమ సలహాదారు యన్.చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఉదయం లాసన్స్ బే కాలనీలోని బొత్స ఝాన్సీ ఎన్నికల కార్యాలయంలో నిర్వహించిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మేనిపెస్టోలో చెప్పిన హామీలను జగన్ మోహన్ రెడ్డి అమలు చేసారన్నారు. రాజకీయ పార్టీలు ఎన్నికల్లో గెలుపు కోసమే మేనిఫెస్టో ప్రకటించడం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు.

నర్సీపట్నం ఆర్‌డిఒపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : పోస్టల్ బ్యాలెట్ సమయంలో నర్సీపట్నం ఆర్డీఓ వ్యవహరించిన తీరు ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఉందని, ఆయనపై ఎన్నికల సంఘం తక్షణం చర్యలు తీసుకోవాలని నర్సీపట్నం టిడిపి అభ్యర్థి, టిడిపి మాజీ మంత్రి సిహెచ్ అయ్యన్నపాత్రుడు డిమాండ్ చేశారు. మంగళవారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ,పోలింగ్ ఏజెంట్లకు ఇచ్చే పత్రాలపై అర్‌ఓ సంతకాలు పెట్టకుండా ఇచ్చారన్నారు.ఈ విషయంపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. నర్సీపట్నం ఆర్డీఓ జగన్ మోహన్ రెడ్డికి భయపడుతున్నారా అని ప్రశ్నించారు.నా రక్తం లో ఉన్నది పసుపు రంగు మాత్రమే అందుకే నేను వైసిపి ఇచ్చిన అవకాశాన్ని తిరస్కరించానన్నారు. తనకు రాజకీయంగా జన్మ ఇచ్చిన తెలుగుదేశం పార్టీని వీడే ప్రసక్తి లేదని అన్నారు. వై నాట్ 175 అని గంభీరంగా పలికిన జగన్ రెడ్డి ఇప్పుడు స్వరం మారుతోందన్నారు. జగన్మోహన్ రెడ్డి కి ఓటమి భయం మొదలైందన్నారు.ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ చాలా ప్రమాదకరమని చెప్పారు. ఈ సమావేశంలో టిడిపి జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి పాల్గొన్నారు.

రెల్లిల సంక్షేమంపై నిర్లక్ష్యం

విశాఖ కలెక్టరేట్: షెడ్యూల్డ్ తరగతుల్లో ఆఖరి స్థానంలో ఉన్న రెల్లి సామాజిక తరగతికి చంద్రబాబు ముఖ్యమంత్రి హయాంలో అనేక విధాలుగా మేలు జరిగిందని, జగన్మోహన్ రెడ్డి పాలనలో తమను తీవ్రంగా నిర్లక్ష్యం చేశారని రెల్లి కులాల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొడుగు కుమార్ ఆరోపించారు. మంగళవారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

యాజమాన్య కుట్రలను తిప్పికొడదాం

ప్రజాశక్తి-ఉక్కునగరం

స్టీల్‌ప్లాంట్‌ను నష్టాల్లోకి నెట్టి ఆర్థికంగా కార్మికులను కష్టాలు పాల్జేసి బలవంతంగా ప్రయివేటీకరణవైపు నెట్టాలని చూస్తున్న యాజమాన్య కుట్రలను తిప్పికొట్టేందుకు కార్మికుల పెద్ద ఎత్తున తరలిరావాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలో చేపట్టిన దీక్షలకు మంగళవారం నాటికి 1181వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో స్టీల్‌ప్లాంట్ సిఆర్‌ఎంపి, సిఎంఎం, సిఇడి, లూబ్రికేంట్స్, హైడ్రాలిక్స్ విభాగాలకు చెందిన ఉద్యోగులు కూర్చున్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ, రాజకీయంగా కార్మికులను వాడుకోవాలని చూస్తున్న నాయకులే తప్ప చిత్తశుద్ధితో స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం పనిచేస్తున్న నేతలు ఎక్కడున్నారని ప్రశ్నించారు. ప్రధాని మోడీ సభలో స్టీల్‌ప్లాంట్ అంశంపై ఎవరూ ప్రశ్నించలేదన్నారు. ఇప్పటికైనా రాజకీయ నేతలు మనోగతాన్ని తెలుసుకొని కార్మికులే స్వయంగా పోరాడి విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

గర్భిణులకు సరైన వైద్యం అందించాలి

ప్రజాశక్తి -ఆనందపురం : ప్రతి గర్భిణికీ సరైన వైద్య సేవలు అందేలా ఆశ కార్యకర్తలు కృషిచేయాలని ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎం.గంగునాయుడు ఆదేశించారు. మంగళవారం పిహెచ్‌సిలో జరిగిన ఆశ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గర్భిణులకు వైద్య సేవల విషయంలో నిర్లక్ష్యం చేయవద్దన్నారు. క్రమం తప్పకుండా అవసరమైన అన్ని రకాల పరీక్షలూ చేయించాలన్నారు. గర్భిణులను ఆసుపత్రులకు తీసుకొచ్చేటప్పుడు తల్లీబిడ్డ, 108 వాహనాలను ఉపయోగించుకోవాలని సూచించారు. గర్భిణుల వైద్యసేవలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని చెప్పారు. హైరిస్క్ గర్భిణుల పట్ల ఎఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలు ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలన్నారు. టీబీ వ్యాధి రాకుండా పెద్దలకు అడల్ట్ బీసీజీ టీకా కార్యక్రమం ఈ నెలలో ప్రారంభమవుతుందని తెలిపారు. ప్రజలంతా ఈ వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి పి.సాంబమూర్తి, ఆరోగ్య పర్యవేక్షకులు పార్వతమ్మ, కృష్ణమోహన్, టిబి సూపర్‌వైజర్లు వీరబ్రహ్మం, సురేష్, ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పిలు పాల్గొన్నారు.

టిడిపిలో చేరికలు

ప్రజాశక్తి -పిఎం పాలెం : జివిఎంసి ఆరో వార్డు పరిధి వైభవ్ ఫంక్షన్ హాల్ సమీపంలో మంగళవారం భీమిలి కూటమి అభ్యర్థి గంటా శ్రీనివాసరావు, విశాఖ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్ నేతృత్వంలో పార్లమెంటరీ తెలుగు యువత ఉపాధ్యక్షులు గరే గురునాథ్ ఆధ్వర్యాన ఆరో వార్డు పరిధి గాయత్రి నగర్, బి టు కాలనీ, ఆర్ హెచ్ కాలనీ ప్రాంతానికి చెందిన సుమారు 500 మంది వైసిపి నుంచి టిడిపిలో చేరారు. వారికి గంటా శ్రీనివాసరావు, శ్రీభరత్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. భీమిలిలో కూటమి గెలుపునకు తన సాయిశక్తులా కృషి చేస్తా గరే గురునాథ్ అన్నారు. ఈ కార్యక్రమంలో భీమిలి టిడిపి ఇన్చార్జి కోరాడ రాజబాబు, దాసరి శ్రీనివాస్, జనసేన నాయకులు ఈఎన్‌ఎస్ చంద్రరావు, సంతోష్ నాయుడు, స్థానిక నాయకులు రెడ్డి సత్యనారాయణ, లొడగల జానకిరామ్ తదితరులు పాల్గొన్నారు.

నగరాల ఆత్మీయ సమావేశం


పిఎం.పాలెం క్రికెట్ స్టేడియం సమీపంలో ఉన్న వి కన్వెన్షన్ సెంటర్‌లో మంగళవారం నగరాల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా గంటా శ్రీనివాసరావు, ఎం.శ్రీభరత్ హాజరై మాట్లాడారు. నగరాల సామాజిక వర్గం సమస్యలను కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే పరిష్కారానికి కృషిచేస్తామని హామీ ఇచ్చారు. నగరాల సామాజిక వర్గానికి కల్యాణ మండపం ఏర్పాటుచేస్తామన్నారు.

'కాకరకు టిడిపితో సంబంధం లేదు'

ప్రజాశక్తి- ఆనందపురం : మండలంలోని వెల్లంకి పంచాయతీకి చెందిన సీనియర్ నాయకుడు కాకర వెంకటరమణ టిడిపిలో చేరినట్లు వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని భీమిలి టిడిపి ఇన్చార్జి కోరాడ రాజబాబు తెలిపారు. అవకాశవాద రాజకీయాలు చేస్తున్న కాకరకు కనీసం టిడిపి ప్రాథమిక సభ్యత్వం కూడా లేదని చెప్పారు. తనకు గాని, భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థి గంటా శ్రీనివాసరావుకు గాని తెలియకుండా పార్టీలోకి ఎలా వచ్చారని ప్రశ్నించారు.

44వ వార్డులో కాంగ్రెస్ ప్రచారం

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 44వ వార్డులో ఉత్తర నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి లక్కరాజు రామారావు మంగళవారం ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైసిపి ప్రభుత్వం వల్ల రాష్ట్రం పూర్తిగా నాశనమైందన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, మన హక్కులు కాపాడుకోవాలన్నా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావాల్సిన అవసరం ఉందన్నారు. ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యేగా గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని హామీ ఇచ్చారు. ప్రతి ఒక్కరూ హస్తం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ముస్లిం పెద్దలతో సమావేశాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, సిపిఎం నాయకులు పాల్గొన్నారు.



44వ వార్డులో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి రామారావు

టిపిటి కాలనీలో 'జైభారత్' ప్రచారం

ప్రజాశక్తి-యంత్రాంగం

సీతమ్మధార : జై భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షులు, ఉత్తరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వివి.లక్ష్మీనారాయణ మంగళవారం టిపిటి కాలనీలో ప్రచారం నిర్వహించారు. ఈవిఎంపై అవగాహన కల్పిస్తూ ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అందరూ ఓటు హక్కును వినియోగించుకొని ఓటింగ్ శాతం పెంచాలని కోరారు. తమకు ఎవరైతే మేలు చేస్తారో ఒకటికి పది సార్లు ఆలోచించి ఓటు వేయాలని విజ్ఞప్తిచేశారు. ప్రజలకు అనుకూలం అండగా ఉంటానని, నియోజకవర్గ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించి ఉత్తమ నియోజకవర్గంగా తీర్చిదిద్దడానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. మీ ఓటు ద్వారా సహాయ సహకారాలు అందించాలని ఓటర్లకు విజ్ఞప్తిచేశారు. తనను అసెంబ్లీకి పంపిస్తే ఉత్తర నియోజకవర్గానికి గుర్తింపు తీసుకొస్తానన్నారు. తమ మేనిఫెస్టోను ప్రజలందరూ పూర్తిగా చదివి అభిప్రాయాలు తెలియజేయాలని కోరారు. సాయంత్రం ఐదు గంటల నుంచి తాటిచెట్లపాలెంలో భారీ ర్యాలీ నిర్వహించారు.

ప్రజానుకూల మేనిఫెస్టో : జైభారత్

పెందుర్తి : ప్రజలకు అనుకూలంగా ఉండే మేనిఫెస్టోను రూపొందించామని జై భారత్ నేషనల్ పార్టీ పెందుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మహదేవ్ కళ్యాణ్ అన్నారు. జివిఎంసి 95వ వార్డు పరిధి రత్నగిరినగర్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో కాలుష్యంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. చదువుకున్న యువతకు సరైన ఉపాధి లేక పక్క రాష్ట్రాలకు వెళ్లే పరిస్థితి ఏర్పడిందన్నారు. రైతుల సమస్యలపై సలహా బాక్స్‌ను ఏర్పాటుచేసి పరిష్కరిస్తామని తెలిపారు. అన్ని చెరువులూ కబ్జాకు గురయ్యాయన్నారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే నూతనంగా చెరువులు నిర్మిస్తామని తెలిపారు. పంచ గ్రామాల సమస్య పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. ప్రతి ఇంటికీ సోలార్ సిస్టమ్, ఇంటర్నెట్ సౌకర్యాలను కల్పిస్తామని తెలిపారు. పెందుర్తిలో 8వ తేదీన జరగబోయే బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. ప్రతి ఒక్కరూ ఆలోచించి ఈ ఎన్నికల్లో మంచి వ్యక్తిని ఎన్నుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సింగంపల్లి రవితేజ, జగన్ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

క్రికెటర్ల ప్రతిభను గుర్తించేందుకు ఎసిఎ చర్యలు

ప్రజాశక్తి -పిఎం పాలెం : అట్టడుగు స్థాయి క్రికెటర్లలో ప్రతిభను గుర్తించేందుకు వీలుగా రైజింగ్ స్టార్స్ పేరిట ఎసిఎ ఒక వేదికను అందిస్తోందని, వీటిని ప్లేయర్లు సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్ఆర్.గోపినాథ్ రెడ్డి సూచించారు. ఈ నెల 10వ తేదీన మూడు ప్రాంతాల్లో ట్రయల్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. వైజాగ్‌లోని- డాక్టర్ వైఎస్ఆర్ ఏసిఏ - వీడీసీఏ క్రికెట్ స్టేడియం "బి" గ్రౌండ్, గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఏసీఏ అంతర్జాతీయ స్టేడియం, కడప నగరంలోని వైఎస్ఆర్ ఏసీఏ స్టేడియంలలో ట్రయల్స్ జరగనున్నాయని వివరించారు. 10వ తేదీన ట్రయల్స్ కోసం ప్లేయర్‌లు రెండు వేర్వేరు సమయాల్లో స్లాట్‌లను ఎంచుకోవచ్చని తెలిపారు. ఉదయం 6 నుంచి 10 గంటల వరకు, మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 6:30 గంటల వరకు ఉంటాయని వివరించారు.

18 నుంచి 28 మధ్య వయసున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన క్రీడాకారులు అర్హులని తెలిపారు. గత ఏడాది ఏ ఇతర రాష్ట్రానికీ ప్రాతినిధ్యం వహించి ఉండకూడదని వివరించారు. ఈ నెల 8వ తేదీ ఉదయం 9 నుంచి 9వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు ప్లేయర్ ఈ లింక్ http://15.206.63.242/AC/playerOpenRegistration/form ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు.

జాతీయ రిఫరీ సెమినార్‌లో మధురవాడ క్రీడాకారులు

ప్రజాశక్తి -మధురవాడ : న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యాన విజయనగరం జిల్లా రాజీవ్ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 3, 4, 5 తేదీలలో జరిగిన నేషనల్ రిఫరీ సెమినార్ పోటీల్లో మధురవాడ క్రీడాకారులు పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా 150 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ సెమినార్లో విశాఖపట్నం యూత్ తైక్వాండో క్లబ్ నుంచి 12 మంది క్రీడాకారులకు ఇంటర్నేషనల్ క్లాస్ 1 రిఫరీ తిరుమల్ జయపాల్ శిక్షణ అందించారు. ఇందులో ఫ్రెషర్, రిఫ్రెషర్‌గా శంకర్, నవీన్, సురేష్, గోపాలకృష్ణ, మణికంఠ, బాలచంద్ర, ఆదిత్య, జశ్వంత్, శ్రీకర్, ధనలక్ష్మి, ఐషిత, నిత్యశ్రీ పాల్గొన్నారు. ఈ సెమినార్‌లో న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షులు పి.అచ్యుతరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.అచ్చింనాయుడు, కార్యదర్శి సి.హెచ్.వేణుగోపాలరావు, శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి భాస్కర్‌రావు యూత్ తైక్వాండో క్లబ్ అధ్యక్షుడు సుకుమార్ సంపత్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమములో వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.అచ్చింనాయుడు మాట్లాడుతూ, ఇక ముందు జరగబోయే జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రిఫరీ చెయ్యటానికి శిక్షణ పొందిన క్రీడాకారులు అర్హత సాధించారని తెలిపారు.

నేరాలు ఘోరాలు

కారు ఢీకొని మహిళ మృతి

ప్రజాశక్తి- సీతమ్మధార : విశాఖపట్నం రైల్వే స్టేషన్ ఇన్ గేట్ వద్ద సోమవారం రాత్రి కారు ఢీకొని ఒక మహిళ మృతిచెందింది. సుమారు 55 నుంచి 65 సంవత్సరాల మధ్య వయసున్న మహిళ రైల్వే గేటు వద్ద భిక్షాటన చేస్తుండగా AP39 TA 2895 కారు కాన్వెంట్ జంక్షన్ నుంచి వస్తూ ఆమెను ఢీకొట్టింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. మృతదేహాన్ని పోలీసులు కెజిహెచ్ శవాగారానికి తరలించారు. మహిళ గురించి తెలిసినవారు నాలుగో పట్టణ పోలీసులను సంప్రదించాలని ట్రాఫిక్ ఎస్ఐ వాణిశ్రీ కోరారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని జెవి.అగ్రహారం గ్రామానికి చెందిన తన భర్త చుక్క అప్పలనాయుడు (పెయింటర్) ఈ నెల 5వ తేదీ నుంచి కనిపించడంలేదని భార్య భవానీ మంగళవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. భవానీ ఓ ప్రైవేట్ సంస్థలో హౌస్ కీపింగ్ పనిచేస్తున్నారు. ఈ నెల 5వ తేదీన ఉదయం పనికి వెళ్లిన ఆమె సాయంత్రం 6గంటలకు ఇంటికి వచ్చారు. తన భర్త ఇంట్లో లేకపోవడంతో ఎక్కడకు వెళ్లారని అత్తను అడిగారు. మోటారు సైకిల్‌పై వెళ్లారని, ఎక్కడకు వెళ్లారో తెలియదని ఆమె అత్త బదులిచ్చారు. స్నేహితులు, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదుచేశారు. అప్పలనాయుడు ఎత్తు 5అడుగులు, నీలం రంగు చొక్కా, గ్రీన్ కలర్ ఫ్యాంట్ ధరించి ఉన్నాడు. టెన్త్ వరకు చదివాడు. ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు. హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



భీమిలి ప్రభుత్వ డైట్ వద్ద ఓటు వేసేందుకు క్యూ లైన్‌లో ఉన్న ఉద్యోగులు

పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ప్రారంభం

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డైట్‌లో ఏర్పాటుచేసిన 5 పోలింగ్ కేంద్రాల్లో మంగళవారం పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5 వరకు పోలింగ్ జరిగింది. నియోజక వర్గం పరిధిలో ఉన్న పోలీసులు, ఆర్‌డిఒ, తహసీల్దార్ కార్యాలయాల ఉద్యోగులు, సిబ్బంది 1174 మంది ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. ఎంత మంది ఓటు హక్కు వినియోగించుకున్నారనేది తెలియాల్సి ఉంది.




రిషితశ్రీకి రూ.25 వేలు బహుమతి ఇస్తున్న సంస్థ ప్రతినిధులు

టెన్త్ విద్యార్థిని రిషితశ్రీకి అభినందనలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : టెన్త్ పరీక్షా ఫలితాల్లో 595 మార్కులు సాధించిన రిషితశ్రీని స్థానిక సాగర్ అసోసియేషన్ ఆఫ్ వాకర్స్ సంస్థ ప్రతినిధులు మంగళవారం అభినందించారు. భీమిలిలోని సంస్థ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ ఆధ్వర్యాన ఆమెకు రూ.25 వేలు బహుమతిగా అందజేశారు. సంస్థ సభ్యులు, మాజీ కౌన్సిలర్ మైలపల్లి లక్ష్మణరావు కుమార్తె రిషితశ్రీ భవిష్యత్తులో ఉన్నత చదువులు చదువుకొని మంచి స్థాయికి ఎదగాలని సంస్థ ప్రతినిధులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు కె.మల్లికార్జునరావు, కార్యదర్శి అవనాపు అప్పలనాయుడు, కోశాధికారి బొండా బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com
విశాఖ, అనకాపల్లి
బుధవారం
8 మే 2024

కలం మాట



ఓటంటే..!

పల్లవి : ఓటు విలువ రెండు వేల
నోటు కాదురన్నయా...!
ఓటు విలువ ఫుల్ బాటిల్
మందు కాదురన్నయ..!!
ఓటంటె ఐదేలు మా బతుకుల
బాధ్యత నీదేనంటూ వేలి
చుక్కవేయించుకు...
మనమిచ్చే ప్రాంసరి నోటన్నయ..!!
'ఓటంటే....'

చరణం : నీ హక్కును నువ్వమ్మేసి....
ఐదేళ్లు బానిసలా
బతుకుతావ అన్నయ..!?
ఓటు పాలకులను శాసించే
ఆయుధమురా అన్నయ...
నీ పిలక వారి చేతి కిచ్చి
నువ్ పాట్లు పడకు రన్నయ..!!
'ఓటంటే....'

చరణం : నీ బతుకుకు భరోసా...
ఎవరో తెలుసుకోర అన్నయ....
వారినే గెలిపించి
ఐదేళ్లు సుఖపడరా అన్నయ...!!
నువ్వు సుఖపడరా అన్నయ
నువ్వు సుఖ పడరా అన్నయ!!!

- కోరాడ నరసింహారావు



సార్వత్రిక సంగ్రామం



ప్రచార హోరు..




- తరలివచ్చిన ప్రధాన పార్టీల అధినేతలు
- సినీ, బుల్లితెర తారల తళుకుబెళుకులు
- రంగంలోకి అభ్యర్థుల కుటుంబ సభ్యులు
- సోషల్ మీడియా, డిజిటల్ వైపే మొగ్గు
- అద్దెకు తెచ్చుకున్న వారితోనూ హడావిడి
- ఇదే అదనుగా చోటానేతల చేతివాటం
- ఓటర్లను ఎరవేసేందుకు ఏర్పాట్లు

ఐదేళ్ల అధికారమే లక్ష్యంగా ప్రధాన రాజకీయ పార్టీలు అన్ని అస్త్రశస్త్రాలను బయటకు తీసి ప్రచార యుద్ధాన్ని కొనసాగిస్తున్నాయి. ప్రచార గడువు సమీపిస్తుండడంతో చావో,రేవో అన్నంతగా సామబేధదాన దండోపాయాలను, ఆఖరి అస్త్రంగా ప్రలోభాల ఎరవేస్తూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నాయి. సాంప్రదాయ ప్రచారంతోపాటు లోపాయికారీ ప్రచారానికి అపుడే తెరలేపాయి. ఈసారి అభ్యర్థుల కుటుంబసభ్యుల, ముఖ్యంగా మహిళలు రంగంలోకి ప్రధాన ప్రచారకర్తలుగా ముందుకు దూసుకెళ్తున్నారు. తారల తళుకుబెళుకు ప్రచారంతోపాటు సోషల్, డిజిటల్ మీడియాను అధికంగా వాడుకుంటూ ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇక ఉద్యమ పార్టీలు పాలకుల వైఫల్యాలు, సమస్యలే అజెండాగా ముందుకు సాగుతున్నాయి.

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్

మరో ఆరురోజులలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ జరగనుంది. ఎన్నికల ప్రచారాలకు శనివారంతో ముగింపు. కేవలం నాలుగు రోజులే బహిరంగ ప్రచారాలకు అవకాశం ఉండడంతో అన్ని ప్రధాన పార్టీల అభ్యర్థులు తమ తమ ప్రచారాలను ఉధృతం చేశారు. జిల్లాలోని ఏ నియోజకవర్గంలో చూసినా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. అభ్యర్థులు స్వయంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొనడంతోపాటు, వారికి మద్దతు తెలుపుతున్న నాయకులు, అలాగే అభ్యర్థుల కుటుంబ సభ్యులు కూడా ప్రస్తుతం ఎన్నికల ప్రచారంలో బిజీ, బిజీగా కనిపిస్తున్నారు. ప్రచారంలో అధిక సంఖ్యలో మహిళలు ఉండే విధంగా ప్రధాన పార్టీల నాయకులు ముఖ్యంగా, అధికార వైసిపి, కూటమి పార్టీలకు చెందిన టిడిపి, జనసేన వంటి పార్టీలు చూస్తున్నారు. వీరిలో అధిక శాతం మంది రోజుకు ఇంత అని తీసుకొని వస్తున్నవారే ఉన్నారన్నది బాహాటంగానే చెప్పుకుంటున్నారు. పెయిడ్ ప్రచారకర్తలను సమీకరించడం, వారిని ప్రచారంలో భాగస్వాములను చేయడం కోసం పార్టీలోని కొందరు చోటామోటా నాయకులు దోహదపడుతున్నారు. ఇదే అదునుగా అభ్యర్థుల నుంచి దండిగానే వసూళ్లు చేస్తున్నారు. ఈ వాస్తవాలు తెలిసినప్పటికీ, ఎవరినైనా, ఏమైనా అంటే, ఎక్కడ ప్లేటు ఫిరాయిస్తారో, ఎలా రియాక్టవుతారో, ఎక్కడ ఇబ్బంది కలుగుతుందోనని అభ్యర్థులు కూడా చూసీచూడనట్లుగా వ్యవహరిస్తూ జేబు డబ్బు మంచినీరులా ఖర్చు చేస్తున్నారు. కొంతమంది అభ్యర్థుల తరపున ప్రచారం చేసేందుకు సినిమా, బుల్లితెరల తారలను రంగంలో దించారు .టిడిపి, బిజెపి, జనసేన కూటమి తరపున ప్రచారంలో ఇటువంటివారు అధికంగా కనిపిస్తున్నారు. ప్రముఖ సినీ నటుడు, టిడిపి నాయకుడు బాలకృష్ణ ఇటీవల జిల్లాలో కూటమి అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారం నిర్వహించారు. బాలకృష్ణ చిన్న అల్లుడు ఎం శ్రీభరత్ విశాఖ పార్లమెంట్ స్థానంలో కూటమి బలపరిచిన టిడిపి అభ్యర్థి కావడంతో, ఆయన తరుపున మరింత విస్తృతంగా బాలకృష్ణ ప్రచారం చేశారు. బిజెపికి చెందిన సినీ నటి నమిత, అలాగే బుల్లితెర నటులు ఇటు బిజెపి, అటు జనసేన తరపున నాలుగైదు రోజులుగా సుడిగాలి ప్రచారం చేస్తున్నారు.

దీనికి భిన్నంగా ఇండియా బ్లాక్ బలపరిచిన సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ అభ్యర్థులు ప్రజా సమస్యలను, ముఖ్యంగా విశాఖ స్టీల్‌ప్లాంట్ రక్షణ, ఇంకా జిల్లాలోనిప్రధాన సమస్యలను, గత ప్రభుత్వాల వైఫల్యాలను ఓటర్లు దృష్టికి తీసుకువెళ్లి, ఇంటింటి ప్రచారానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. వీరి ప్రచారానికి మంచి ఆదరణ లభిస్తుంది. పలువురు ప్రధాన పార్టీల అభ్యర్థులు, ఎలక్ట్రానిక్ డిజిటల్ వాహనాలను ప్రత్యేకంగా తయారు చేయించి, ప్రచారంలో ఉపయోగిస్తున్నారు. ఇది కొత్తఒరవడి. ఇటువంటి వాహనాల నుంచి సంబంధిత పార్టీల అధ్యక్షులు ప్రసంగాలను సూక్ష్మంగా వివరించే కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తున్నారు. పత్రికలు, ప్రధాన ఎలక్ట్రానిక్ మీడియా వివిధ పార్టీలకు కొమ్ముకాస్తుండడంతో, ఒక మీడియాలో వచ్చే ప్రచార వార్తలు, మరో మీడియాలో కనిపించడం లేదు. ఈ వాస్తవాన్ని గుర్తించి అభ్యర్థులు సోషల్ మీడియాను వేదికగా చేసుకొని ప్రచారాన్ని ముమ్మరం చేశారు.



ఇందుకోసం ప్రత్యేక ప్రతినిధులను నియమించుకున్నారు కూడా. ఇప్పుడు అన్ని పార్టీలకు సోషల్ మీడియా పెద్ద ప్రచార వేదికగా దోహదపడిందనడంలో ఎలాంటి సందేహం లేదు. చిన్న చిన్న సందులలో సైతం ఆటోలు తిరిగే ప్రాంతంలో పోటీ అభ్యర్థులు పోటాపోటీగా ప్రచారం సాగిస్తున్నారు. ఇదే సందర్భంలో, ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు, ప్రసన్నం చేసుకునేందుకు ఓటుకు ఇంత అని చెప్పి ఇచ్చేందుకు అభ్యర్థులు ఈసరికే ఏర్పాట్లు పూర్తి చేసినట్టుగా తెలిసింది. ఇందుకోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసుకున్నారు. నేరుగా ఇంటింటికి వెళ్లి డబ్బు పంపిణీ చేయడం కంటే, పేటీఎం, గూగుల్ పే చెల్లింపులు చేసేందుకు కూడా ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి.

శీలానగర్‌లో సిపిఎం ప్రచారం



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న సిపిఎం గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి జగ్గునాయుడు, మహిళలు

ప్రజాశక్తి -గాజువాక : ఇండియా ఫోరం బలపరిచిన సిపిఎం గాజువాక నియోజవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.జగ్గునాయుడు మంగళవారం శీలానగర్, వెంకటేశ్వర కాలనీ, హరిజన జగ్గయ్యపాలెం ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేస్తూ సిపిఎం అభ్యర్థిగా పోటీచేస్తున్న తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. గతంలో ఏ కొద్దిపాటి వర్షం వచ్చినా కాలనీ ముంపునకు గురయ్యేదన్నారు. సిపిఎం పోరాట ఫలితంగా శీలానగర్ ముంపు సమస్య శాశ్వతంగా పరిష్కారమైన విషయాన్ని గుర్తుచేశారు. ఈ ప్రచారంలో సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు, ఎస్వి.కుమార్, వై.సత్యవతి, ఎస్.జ్యోతీశ్వరరావు, జీవీ రమణ, పి.వెంకటరెడ్డి, శ్రీదేవి, రమణమ్మ పాల్గొన్నారు. ప్రజానాట్యమండలి కళాకారులు ఆటలు పాటలు అలరించాయి.

దక్షిణంలో వాసుపల్లి విస్తృత ప్రచారం



ఎన్నికల ప్రచారంలో వాసుపల్లి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి 24 వ వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి,27వ వార్డు పార్టీ అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో ఆయా వార్డుల్లో వైసిపి దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సిద్ధి వినాయక కాశీ విశ్వనాథ స్వామి విశాలాక్షి అమ్మవారి దేవాలయంలో ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీతో కలిసి పూజలు నిర్వహించిన వాసుపల్లి, అనంతరం వర్షంలోనూ ప్రచారం సాగించారు. సిఎం జగన్, వైసిపి ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ పథకాలతో మంచి మెజార్టీతో విజయం సాధిస్తానని వాసుపల్లి ధీమా వ్యక్తంచేశారు. దక్షిణ ఎమ్మెల్యేగా తనను, విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీని ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు.

ఎపికి ప్రత్యేక హోదా కాంగ్రెస్‌తోనే సాధ్యం



ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి గంగాధర్

ప్రజాశక్తి - అనకాపల్లి : విభజన హామీలు అమలు, ఎపికి ప్రత్యేకహోదా, స్టీల్‌ప్లాంట్ వంటి ప్రభుత్వరంగ సంస్థ పరిరక్షణ ఇండియా బ్లాక్ విజయంతోనే సాధ్యమని అనకాపల్లి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఐఆర్.గంగాధర్ అన్నారు. మంగళవారం అనకాపల్లి పట్టణంలోని పూడిమడక రోడ్డు, పెదరెల్లి వీధి ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదేళ్ల అధికారంలో ఉన్న స్థానిక ఎమ్మెల్యే, మంత్రిగా పనిచేసిన వ్యక్తి నేడు ఓటమి భయంతో పక్క జిల్లాకు వెళ్లిపోయాడంటే, వైసిపి చేసిన అభివృద్ధి, ప్రజల్లో ఆపార్టీకి ఉన్న విశ్వసనీయత ఏపాటిదో స్పష్టమౌతోందన్నారు.

రాజ్యాంగ హక్కులను కాలరాయడం, అవినీతి, ఆశ్రితపక్షపాతం, వేధింపులు, అరాచకాలే హంగులుగా వైసిపి పాలన సాగించిందని మండిపడ్డారు. ఎపికి ప్రత్యేకహోదా, విశాఖ రైల్వేజోన్ ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్యాకేజీ వంటి విభజనహామీలతోపాటు ఏటా రెండు లక్షల ఉద్యోగాలిస్తామని ప్రజలను నమ్మబలికి పదేళ్లు అధికారం వెలగబెట్టిన మోడీ ప్రభుత్వం దేశానికి చేసిందేమీ లేదన్నారు.

ఆంధ్రాకు తీరని అన్యాయం చేసిన మోడీ పల్లకిని చంద్రబాబు, పవన్ మోయడం తగదన్నారు.స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ, విభజన హామీల అమలుకు ఇండియాబ్లాక్ బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థిగా తనను, అనకాపల్లి ఎంపిగా వేగి వెంకటేష్‌లను గెలిపించాలని గంగాధర్ పిలుపునిచ్చారు. ప్రచారంలో పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు దాసరి సంతోష్, యూత్ కాంగ్రెస్ నాయకులు కొల్లి సత్యారావు, నందికి విజయకుమార్, తాండ్రకోట పవన్ కుమార్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా!

ప్రజాశక్తి- పరవాడ: సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని కూటమి బలపరిచిన పెందుర్తి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు హామీనిచ్చారు. మంగళవారం మండలంలోని రావాడ పంచాయతీ గొల్లగుంటలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా స్థానికులు శ్మశానవాటిక సమస్యలను పంచకర్ల దృష్టికి తేగా, నెలరోజుల్లో సమస్య పరిష్కరిస్తానని భరోసానిచ్చారు. రావాడ సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు, పరవాడ మాజీ జెడ్‌పిటిసి పైల జగన్నాధరావు, టిడిపి మండల అధ్యక్షులు వియ్యపు చిన్న, మాజీ ఎంపిటిసి జోగునాయుడు, మోటూరు హరిబాబు పాల్గొన్నారు.

జనసేనలో 30 కుటుంబాల చేరిక

లంకెలపాలెం బిసి సెల్ అధ్యక్షులుగా నియమితులైన ఎడ్ల అప్పారావు ఆధ్వర్యంలో బిసి కాలనీకి చెందిన 30 కుటుంబాలు వైసిపిని వీడి జనసేనలో చేరారు.వీరికి కండువాలు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల పార్టీలోకి ఆహ్వానించారు. దేశపాత్రునిపాలెం, జాజులవానిపాలెంలో కూటమి శ్రేణుల భారీ బైక్ ర్యాలీతో రోడ్‌షోగా ప్రచారం నిర్వహించిన పంచకర్లకు స్థానిక మహిళలు హారతులిచ్చి స్వాగతించారు. పరవాడ సంతబయలు రాములోరి సింహద్వారం నుంచి చిన్న స్కూల్ వీధి వరకు సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడు అధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు.

తండ్రికి మద్దతుగా తనయుడు ప్రచారం

పెందుర్తి : జివిఎంసి 97వ వార్డు పరిధి సప్తగిరినగర్‌లో కూటమి అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు తరుపున ఆయన తనయుడు రఘునాథన్ మంగళవారం ప్రచారం నిర్వహించారు. 97వ వార్డు టిడిపి కార్పొరేటర్ సేనాపతి వసంత పాల్గొన్నారు



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న పంచకర్ల రమేష్‌బాబు

పంచకర్లకు మద్దతుగా యుకె జనసేన టీం ప్రచారం

'ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వాన్ని మార్చుదాం.. రాష్ట్రాన్ని బాగు చేసుకుందాం' నినాదంతో ప్రవాస యూకే జనసేన టీం సభ్యులు పంచకర్ల రంగనాథ్, సిద్ధం శంకర్, చంద్ర సిద్ధం, అచ్యుతరావు ప్రజలకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమిని గెలిపించేందుకు ప్రవాస భారతీయులందరూ కృషి చేస్తున్నట్లు తెలిపారు. యూకే, కెనడాల నుంచి 200 మంది జనసేన టీం సభ్యులు రాష్ట్రానికి వచ్చామని, జనసేన పోటీ చేస్తున్న 21 నియోజకవర్గాల్లో ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు.

శాంతిపురంలో సిపిఐ ప్రచారం



ఇంటింటా ప్రచారంలో సిపిఐ ఎమ్మెల్యే అభ్యర్థి విమల, ఇతర పార్టీ నేతలు

ప్రజాశక్తి -గోపాలపట్నం : పశ్చిమ నియోజకవర్గ సిపిఐ ఎమ్మెల్యే అభ్యర్థి అత్తిలి విమల మంగళవారం ఎన్ఎస్‌టిల్, శాంతినగర్ అపార్టుమెంట్లలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వరంగ పరిశ్రమల మనుగడకు, అధికధరల నియంత్రణకు ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. రాష్ట్రానికి రాజధాని కావాలన్నా, పోలవరం నిర్మాణం పూర్తి కావాలన్నా ఇండియా కూటమి అధికారంలోకి రావాలని వివరించారు. నిరంతరం ప్రజా పక్షాన ఉంటూ వామపక్ష పార్టీలు ఉద్యమాలు చేస్తున్నాయని, వీటిని ఓటర్లు గమనించి ఓటు వేయాలని కోరారు. సిపిఐ నాయకులు పి.చంద్రశేఖర్, రాజన దొరబాబు, ఎమ్‌డి బేగం, సుబ్బలక్ష్మి, నల్లయ్య పాల్గొన్నారు.

జోరుగా ముత్తంశెట్టి ఎన్నికల ప్రచారం



బ్రోచర్లను పంచుతూ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ముత్తంశెట్టి

ప్రజాశక్తి - తగరపువలస : భీమిలి మండలం మజ్జిపేటలో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు మంగళవారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు.సిఎం జగన్మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ వైసిపినే గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ నెల 13న జరుగు ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దంతులూరి వాసురాజు, సర్పంచ్ మజ్జి సూరినాయుడు, ఎంపిటిసి సభ్యులు మజ్జి శ్రీనివాసరావు, వైసిపి మండల అధ్యక్షులు గాడు శ్రీనుపాల్గొన్నారు.

బోనిలో

ఆనందపురం : మండలంలో బోని పంచాయతీలో ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర ప్రజలందరికీ ఇంటి స్థలాలతో పాటు సంక్షేమం, అభివృద్ధి అందించారన్నారు. ఈ ఎన్నికల్లో అసెంబ్లీ అభ్యర్థిగా తనను, విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీని గెలిపించాలని కోరారు. బంక సత్యం, వెంకటరావు, అప్పలనాయుడు, బోని అప్పలకొండ, సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి అనిత ఇంటింటా ప్రచారం



వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న పాయకరావుపేట టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి అనిత

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలో పెదదొడ్డుగల్లు గ్రామంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా పాకరావు పేట నియోజకవర్గం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత మంగళవారం నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటా ప్రచారం చేపట్టారు. సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించి, సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ముస్లిం మైనారిటీలకు ఉన్న రిజర్వేషన్లు తొలగిస్తారని వైసీపీ చేస్తున్న అబద్ధపు ప్రచారాన్ని నమ్మవద్దన్నారు. కూటమి ప్రభుత్వం అధికారుల్లోకి రాగానే ముస్లిం మైనారిటీలకు రిజర్వేషన్లు కొనసాగిస్తూ వారికి ప్రత్యేకంగా ఇళ్ల స్థలాలను కేటాయిస్తామని తెలిపారు. ఇమామ్, మౌజాలకు 5 వేల గౌరవ వేతనం అందజేస్తామని, మసీదు మరమ్మత్తులకు, కొత్త వాటి నిర్మాణానికి ఆర్థిక సహాయం అందజేస్తామని హామీ ఇచ్చారు. ముస్లిం మైనారిటీలకు 50ఏళ్లకే రూ.4 వేల పెన్షన్ వచ్చేలా చేస్తానని, ఆడపిల్ల పెళ్ళికానుక కింద ఇచ్చే రూ.25 వేలను రూ.లక్షకు పెంచుతామన్నారు. తనకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థులు

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై మోడీ, బాబు వైఖరి అన్యాయం

- విభజన హామీలు, కాలుష్య గ్రామాల తరలింపుపై పెదవి విప్పకపోవడంపై సిపిఎం, కాంగ్రెస్ నేతలు ఆగ్రహం

ప్రజాశక్తి- పరవాడ

కశింకోట మండలం రాజుపాలెం వద్ద సోమవారం జరిగిన ఎన్‌డిఎ కూటమి ఎన్నికల బహిరంగసభలో దేశ ప్రధాని మోడీ, టిడిపి అధినేత చంద్రబాబు ఉత్తరాంధ్ర ప్రజలను మరోసారి మోసం చేశారని సిపిఎం, కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. వారి ప్రసంగాల్లో ప్రత్యేక హోదా, విభజన హామీలు, విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై కనీసం పెదవి విప్పకపోవడం అన్యాయమన్నారు. ఈ మేరకు సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ, అల్లు రాజు, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఆర్ఆర్ నాయుడు మంగళవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. బిజెపి ఎంపీ అభ్యర్థి రమేష్ ప్రధాన మంత్రితో తనకు అత్యంత సాన్నిహిత్యం వుందని, తనను గెలిపిస్తే స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదల చేయిస్తానని చెప్పాడని, విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మేది లేదని మోడీతో ఎందుకు చెప్పించలేదని ప్రశ్నించారు. మోడీ ప్రభుత్వం తీసుకున్న స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నది, లేనిది చంద్రబాబు ప్రకటించాలని డిమాండ్ చేశారు. పరవాడ ఫార్మా కాలుష్య కోరల్లో ఉన్న తాడి, ఎన్‌టిపిసి కాలుష్యంతో అల్లాడుతున్న ములస్యయంభవరం, సోమనాయుడుపాలెం గ్రామాల తరలింపుపై ప్రకటన చేయకపోవడం విచారకరమన్నారు.


మాట్లాడుతున్న సిపిఎం, కాంగ్రెస్ నాయకులు

దేవరాపల్లి : రాజుపాలెం వద్ద ఎన్నికల సభలో ప్రధాని మోడీ విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఉపసంహరణ, సొంత గనులు కేటాయింపు వంటి ప్రాధాన్యత అంశాలను విస్మరించడం అన్యాయమని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి.వెంకన్న మండల కార్యదర్శి బిటి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం వారు స్థానిక సిఐటియు కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ విశాఖ రైల్వేజోన్‌పైనా దొంగ నాటకాలాడుతున్నట్లు అర్థమౌతుందన్నారు. చెరుకు రైతులు గురించి మాట్లాడిన మోడీ ఆ రైతులకు జీవనాధారమైన జిల్లాలోని సుగర్ ఫ్యాక్టరీల పునరుద్ధరణపై ప్రస్తావించకపోవడం రైతులను మోసగించడం తప్ప మరొకటి కాదన్నారు. జిల్లాలో ప్రధాన అంశాలేవి ప్రస్తావించకుండా, రాష్ట్రంలో దేవాలయాలపై దాడులు జరుగుతున్నాయని వాటిని అరికడతామని ఎన్నికల సభల్లో ప్రసంగించడమంటే మత విద్వేశాలను రెచ్చగొట్టి లబ్ధి పొందడానికి బిజెపి పథకం ప్రకారం వ్యవహరిస్తున్నట్లు అర్థమవుతుందన్నారు. ప్రజలు అప్రమత్తమై బిజెపి అభ్యర్థి సిఎం రమేష్, ఆ పార్టీకి మద్దతు ఇస్తున్న పార్టీలను ఓడించడం ద్వారానే దేశ ఐక్యతను, మత సామరస్యాన్ని, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోగలమని వారు స్పష్టం చేశారు.

బిజెపి ఓటమితోనే దేశానికి సుస్థిరత

ప్రజాశక్తి-మునగపాక : రానున్న ఎన్నికల్లో బిజెపి ఓటమితోనే దేశంలో సుస్థిరత ఏర్పడుతుందని ఇండియా వేదిక బలపర్చిన కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి వేగి వెంకటేష్, ఎలమంచిలి ఎమ్మెల్యే అభ్యర్థి తనకాల అనంతరావు అన్నారు. మండలంలోని తోటాడ, సిరసపల్లి, గవర్ల అనకాపల్లి, నారాయణపాలెం గ్రామాలలో మంగళవారం వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కల్లబొల్లి మాటలతో ఓట్లు దండుకోవడం కోసం వస్తున్న వైసిపి, టిడిపి, జనసేన పార్టీలకు ఓట్లు వేస్తే అంతిమంగా అవి బిజెపికి వేసినట్లేనని పేర్కొన్నారు. బిజెపి తిరిగి అధికారంలోకి వస్తే దేశాన్ని బడా పారిశ్రామికవేత్తలకు తాకట్టు పెట్టడానికి రంగం సిద్ధం చేస్తుందని చెప్పారు. పేదల పార్టీ అయినా కాంగ్రెస్ మత సామరస్య కోసం పోరాడుతుందని, అటువంటి కాంగ్రెస్ పార్టీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీ చేస్తున్న తమకు హస్తం గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఆళ్ల మహేశ్వరరావు, ఎస్ బ్రహ్మజీ, కాంగ్రెస్ నాయకులు ఆదిమూర్తి, రాము ,పెంటరావు, మణికంఠ, ఆడారి చిరంజీవి పాల్గొన్నారు.

బిజెపి అభ్యర్థి సిఎం.రమేష్‌ను ఓడించాలి

ప్రజాశక్తి-చోడవరం : స్థానికేతరుడైన బిజెపి అభ్యర్థి సీఎం రమేష్‌ను ఓడించాలని జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి అధ్యక్షులు మేకల రాములు విజ్ఞప్తి చేశారు. బీసీవై పార్టీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థితో కలిసి చోడవరంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రశాంతమైన అనకాపల్లి జిల్లాలో భూకబ్జాలు, పరిశ్రమల దోపిడీకి సీఎం రమేష్ ఈ ప్రాంతాన్ని ఎంచుకున్నాడని ఆరోపించారు. బిజెపికి ఉత్తరాంధ్రపై ప్రేమ ఉంటే విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేసేది లేదని ప్రకటన చేయాలన్నారు. బ్యాంకులను లోటీ చేసిన సీఎం రమేష్ ఇక్కడ ప్రజా నాయకునిగా ఫోజు కొడుతున్నాడని, ఆయన్ని చిత్తుగా ఓడించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరారు. వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు బిజెపి ముందు మోకరిల్లాయన్నారు. కార్యక్రమంలో యాదవ హక్కుల పోరాట సమితి నాయకులు కోడిపోయిన బాబ్జి, ఆదిలక్ష్మి, వెంకటేశ్వరరావు, వియ్యపు భూలోక నాయుడు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండలంలోని వి.సంతపాలెం గ్రామంలో శ్రీసత్య సాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. గ్రామానికి చెందిన సత్యసాయి భక్తులు ప్రతిరోజు మజ్జిగను బాటసారులకు, ప్రయాణికులకు అందజేయనున్నారు. ఈ కార్యక్రమంలో సిరికి నరసింహమూర్తి, రామారావు, లెక్కల సత్యనారాయణ, వేచలపు రామునాయుడు, పలువురు సత్యసాయి భక్తులు పాల్గొన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై నిరసన

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : ప్రజల భూములను కాజేసేందుకే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను జగన్ సర్కార్ తీసుకు వచ్చిందని టిడిపి మండల అధ్యక్షులు గోకవరం కోటేశ్వరరావు అన్నారు. మంగళవారం టిడిపి నాయకులతో కలిసి మండల తాసిల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సాగులో ఉన్న భూములను దక్కించుకోవడానికి వైసిపి సర్కార్ కుతంత్రాలను పన్నుతుందన్నారు. ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ తహసిల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకుడు దొంకిని అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మోడీని కలిసిన నాగజగదీష్

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సోమవారం అనకాపల్లి జిల్లా కశింకోటలో జరిగిన బహిరంగ సభకు విచ్చేసిన సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్ మర్యాదపూర్వకంగా కలిసి అభివాదం చేశారు.


ప్రధాని మోడీకి అభివాదం చేస్తున్న టిడిపి నేత నాగ జగదీష్

జిల్లాలో వంద శాతం వెబ్ కాస్టింగ్

జిల్లా కలెక్టరు రవి పట్టన్ శెట్టి

ప్రజాశక్తి- అనకాపల్లి

జిల్లాలో అన్ని పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ చేస్తున్నట్లు జిల్లా కలెక్టరు, జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టన్ శెట్టి తెలిపారు. మంగళవారం కలెక్టరు కార్యాలయంలో పార్లమెంటుకు పోటీ చేస్తున్న అభ్యర్థులు, వారి ఏజెంట్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో (పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గంతో కలిపి) 15,96,916 మంది ఓటర్లు, 4449 మంది సర్వీసు ఓటర్లు ఉన్నారని చెప్పారు. 1828 పోలింగ్ కేంద్రాలు ఉండగా, ఎన్నికల నిర్వహణకు 1859 మంది పిఒలు, 1927 మంది ఎపిఒలు, 7480 మంది పోలింగ్ అధికారులు, 380 మంది సూక్ష్మ పరిశీలకులను నియమించినట్లు చెప్పారు. 1000 మంది 85 సంవత్సరాలు నిండిన, వికలాంగులైన ఓటర్లు ఫారం-12 హోమ్ ఓటింగ్‌కు దరఖాస్తు చేయగా 880 మంది హోమ్ ఓటింగ్‌ను వినియోగించుకున్నట్లు చెప్పారు. అత్యవసర సేవలకు చెందిన 1340 మందికి పోస్టల్ బ్యాలెట్ ఇవ్వగా ఇప్పటి వరకు 341 మంది, ఎన్నికల విధులలో వున్న 11,518 మంది పోస్టల్ బ్యాలట్ తీసుకోగా 6వ తేదీ నాటికి వారిలో 5126 మంది ఓటు చేశారని చెప్పారు. ఈ సమావేశంలో డిఆర్‌ఓ బి.దయానిధి, నోడల్ అధికార్లు ఎపిఎంఐపి ఏడి జివి.లక్ష్మి, మత్స్యశాఖ డిడి పి.ప్రసాదు, పశుసంవర్ధక శాఖ జెడి బి.ప్రసాదు, డిఎంహెచ్‌వో ఏ.హేమంత్, సిపివో జి.రామారావు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు డి.రామ్మూర్తి, వివిధ అభ్యర్థుల ఏజెంట్లు పి.ఉమాదేవి (బిఎస్పి), వి.అభిషేక్ (కాంగ్రెస్), పి.ప్రకాశరావు (పిరమిడ్ పార్టీ) ఎం.సంగీత్ (బి.జె.పి), ఎ.అనిల్ కుమార్ (వైసిపి), ఎస్‌కె.బాషా (ఇండిపెండెంట్) తదితరులు పాల్గొన్నారు.

అక్రమ గ్రావెల్ తరలింపుపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : పూడిమడకలో జెట్టి నిర్మాణ పనులలో భాగంగా 40 సంవత్సరాలుగా సాగులో ఉన్న భూములలో అక్రమంగా గ్రావెల్‌ను తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని, తమకు పరిహారం చెల్లించాలని మత్స్యకార కుటుంబాలు డిమాండ్ చేశాయి. మంగళవారం బాధితులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పేర్ల మంగ బాపనమ్మ, అంగ కామేశ్వరి, చల్లా లక్ష్మి మాట్లాడుతూ సర్వే నెంబరు 134బి2లో 7 ఎకరాల విస్తీర్ణంలో 40 సంవత్సరాల క్రితం నుండి జీడి మామిడి, సరుగుడు తోటలు వేసి వాటిపై వచ్చే ఫలసాయంతో జీవనం సాగిస్తున్నామని తెలిపారు. తమ భూములలో పల సాయానికి వచ్చినా జీడి తోటలను అక్రమంగా నరికి తరలించారని తెలిపారు. జీడి తోటలు నరికిన భూమిలో గ్రావెల్ మట్టి కాంట్రాక్టర్లు అక్రమంగా తరలిస్తున్నారన్నారు. గ్రామ రెవెన్యూ అధికారుల నుంచి మొదలుకొని జిల్లా కలెక్టర్ వరకు తమకు న్యాయం చేయాలని విన్నవించుకున్నట్లు చెప్పారు. సంబంధిత అధికారులు నేటి వరకు తమకు న్యాయం చేయలేదని వాపోయారు. ఎప్పటికైనా అధికారులు స్పందించి తమ భూములకు సంబంధించి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

నేడే పోస్టల్ బ్యాలెట్ ఓటుకు ఆఖరు తేదీ

ప్రజాశక్తి-అనకాపల్లి : పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేందుకు ఈ 8వ తేదీ బుధవారం ఆఖరు రోజని, ఇప్పటి వరకు బ్యాలెట్ ఓటు వేయని ఎన్నికల అధికారులు, సిబ్బంది తప్పక వినియోగించుకోవాలని జిల్లా కలెక్టరు రవి పట్టన్ శెట్టి మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఆయా నియోజక వర్గాలవారికి సౌకర్యం అందుబాటులో వుంటుందని చెప్పారు.

వర్షంతో ఉపశమనం

వ్యవసాయానికి ఉపయోగమంటున్న రైతులు

ప్రజాశక్తి- కె.కోటపాడు

మండలంలో మంగళవారం ఉదయం కురిసిన వర్షంతో ప్రజలకు కొంతవరకు ఉపశమనం కలిగింది. నెల రోజుల నుంచి సూర్యుని ప్రతాపంతో ప్రజలు అల్లాడిపోయారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండలు మండి వడగాల్పుల వల్ల ప్రజలు పనులకు స్వస్తి పలికి ఇళ్లకే పరిమితమయ్యేవారు. మంగళవారం నాటి వర్షంతో ప్రజలు సేదతీరారు. ఈ వర్షం పంటలకు కూడా మేలుకలుగుతుందని రైతులు చెబుతున్నారు. ఇప్పటికే దాల్వవరి, వేరుశనగ, నువ్వులు, చెరుకు పంటల పనులు ముగించుకొని రైతులు ఖాళీగా ఉన్న సమయంలో వర్షం పడటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సరుగుడు తోటలతోపాటు చెరుకు మొక్కలకు కూడా ఈ వర్షం దోహదపడుతుందని అంటున్నారు. ఎండల వల్ల పశు గ్రాసం కొరత ఏర్పడిందని, ఈ వర్షం వలన మళ్లీ పశు గ్రాసం లభిస్తుందని చెబుతున్నారు. ఏది ఏమైనా ఈ వర్షం అన్ని రకాలుగా ఉపయోగపడుతుందని మండల ప్రజలు అంటున్నారు.

కశింకోట : కశింకోట మండలంలో మంగళవారం ఉదయం వాతావరణం మార్పుతో చిరు జల్లులు కురిశాయి. ఎండ వేడిమికి అల్లాడుతున్న ప్రజలకు ఈ వర్షంతో కొంత సేద తీరారు. ఎండ తీవ్రత తగ్గింది. ఈ వర్షం ఎక్కువ పడితే రైతులకు ఉపయోగం వుంటుందని అంటున్నారు.

బుచ్చయ్యపేట : మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఓ మోస్తారు వర్షం కురిసింది. కొంతకాలంగా తీవ్రమైన ఎండ ఉక్కపోతతో విలవిల్లాడిన ప్రజానీకానికి వర్షం ఉపశమనం కలిగించింది.

కొత్తకోట : రావికమతం మండలంలో మంగళవారం కురిసిన వర్షంతో వాతావరణం కాస్త చల్ల బడింది. గత నెల రోజులుగా కాస్తున్న ఎండలకు ప్రజలు విలవిలాడుతున్న తరుణంలో ఈ వర్షం కురవడంతో ప్రజలు కాస్త సేద తీరారు. కొత్తకోట, దొండపూడి, కొత్తపట్నం, చీమలపాడు తదితర ప్రాంతాలలో ఉదయం 9 గంటల నుంచి సుమారు రెండు గంటల పాటు వాతావరణంలో మార్పులు చోటు చేసుకొని ఒక్కసారిగా వర్షం కురిసింది. వర్షం కారణంగా కొత్తకోట కోట రామాలయం వద్ద మురుగు నీటి కాలువ పూడిక పోయి మురుగు నీరు రోడ్డు పై ప్రవహించింది. దీంతో గ్రామస్తులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు.. పంచాయితీ సర్పంచ్ లోవరాజు, ఉప సర్పంచ్ దేవ, ఎంపిటిసి పూడి దేవ, అధికారులు కాలువలో పూడిక తీయించారు.

నక్కపల్లి : రెండు నెలల నుండి అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో విలవిలలాడిన జనం మంగళవారం కురిసిన కొద్దిపాటి వర్షానికి వాతావరణం చల్లబడటంతో ఉపశమనం పొందారు. ఉదయం నుండి ఆకాశం మేఘావృతమై చల్లటి గాలులు వీస్తూ కొద్దిపాటి వర్షం కురిసింది. దీంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. గత కొద్ది రోజులుగా 38 నుండి 41 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడంతో, ఎండ వేడిమికి తట్టుకోలేక జనం బెంబేలెత్తారు. కొద్దిపాటి వర్షానికి వాతావరణం చల్లబడటంతో ప్రజలు సేద తీరారు.


జలమయమైన గొలుగొండ మండలం ఎఎల్ పురం వీధులు

గొలుగొండ : మండలంలోని ఏకైక మేజర్ పంచాయతీ ఏ ఎల్ పురం గ్రామంలో మంగళవారం కురిసిన కాస్త వర్షానికి పలు వీధులు నీట మునిగాయి. ఆయా వీధుల ప్రజలు ఇండ్ల నుండి బయటకు వచ్చేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొంతమంది ఎవరింటి ముందు వాళ్లు మట్టిని ఎత్తుగా పోయించుకున్నారు. దీంతో పరిసరాల ఇల్లు లోతట్టుమయంగా మారి కురుస్తున్న వర్షాలకు జలమయం అవుతున్నాయి. పంచాయతీ కార్యదర్శికి రెండేళ్లుగా మొర పెట్టుకుంటున్నా ఫలితం లేకపోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

అల్లూరికి ఘన నివాళి


కెడిపేటలో నివాళి అర్పిస్తున్న సంఘం సభ్యులు

ప్రజాశక్తి-యంత్రాంగం

విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు 100వ వర్ధంతిని అనకాపల్లి, విశాఖ జిల్లాల్లోని పలుచోట్ల మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు.

అనకాపల్లిడెస్క్:నర్సీపట్నంలో అల్లూరి సీతారామరాజు వర్ధంతిని సిపిఎం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజులు నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయం వద్ద అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అల్లూరి సీతారామరాజు అతి చిన్న వయసులోనే స్వాతంత్య్రం కోసం బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించారన్నారు. ఆ వీరుడు మరణించి వంద సంవత్సరాలు పూర్తి అవుతున్న సందర్భంగా ఘన నివాళులు అర్పిస్తూ.. ఆయన ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో గంగరాజు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సిపిఐ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నర్సీపట్నం ఎన్టీఆర్ స్టేడియంలోని అల్లూరి విగ్రహానికి పూలమాలవేసి విప్లవ జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు మాట్లాడుతూ, గిరిజనులకు అండగా నిలిచి ఉద్యమ పోరాటం చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా ప్రజా సంఘ నాయకులు జీ.గురుబాబు, ఎల్.వి.రమణ, డిసిహెచ్.క్రాంతి, శివలంక కొండలరావు, చౌదరి తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి స్మారకాల అభివృద్ధికి కృషి చేస్తానని అనకాపల్లి ఎన్డీఏ ఎంపి అభ్యర్థి సీఎం రమేష్ అన్నారు. చింతకాయల అయ్యన్నపాత్రుడుతో కలిసి కృష్ణదేవిపేట అల్లూరి స్మారక పార్కును సందర్శించి అల్లూరి, గంటందొర సమాధులకు నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే బోళెం ముత్యాలపాప, నర్సీపట్నం బిజెపి ఇన్‌చార్జ్ ఎర్రంనాయుడు పాల్గొన్నారు.

గొలుగొండ:క్షత్రియ పరిషత్ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు సమాధుల వద్ద క్షత్రియ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.వెంకటపతి రాజు, సౌత్ ఇండియా డైరెక్టర్ లక్ష్మీ నరసింహరాజులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అల్లూరి పార్కులో క్షత్రియ పరిషత్ ఆధ్వర్యంలో గతంలో 16 లక్షల ఖర్చు చేసి భారీ అల్లూరు విగ్రహాన్ని ఏర్పాటు చేశామన్నారు. పార్కు అభివృద్ధికి క్షత్రియ పరిషత్ సభ్యుల ఆర్థిక సహకారంతో మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం గంటం దొర మనవడు బోడిదొర కూతురుకి దారమల్లేశ్వరకి క్షత్రియ పరిషత్తు నుండి 25వేల రూపాయలు, అదేవిధంగా పార్కులో పనిచేస్తున్న ముగ్గురు సంరక్షకులకు 2000 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షులు శివాజీ రాజు, నర్సీపట్నం క్షత్రియ పరిషత్ కార్యదర్శి చక్రపాణి రాజు, సభ్యులు సుబ్రహ్మణ్యం రాజు తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లి :మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు శత వర్ధంతి సందర్భంగా భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ), ప్రజా సంఘాల నాయకులు మంగళవారం మండల కేంద్రంలోని అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఎన్.నారాయణరావు మాట్లాడుతూ దేశంలో బ్రిటిష్ తెల్లదొరల దోపిడిని వ్యతిరేకిస్తూ, ఆదివాసీ గిరిజనులలో చైతన్యం నింపి గొప్ప పోరాటాలు నడిపిన మహాయోధుడు అల్లూరి అని పేర్కొన్నారు. దేశంలో తెల్లదొరలు పోయినా నేటికీ దోపిడి అంతం కాలేదని, మన దేశ పాలకులే దేశ సంపదలు కొద్దిమంది వ్యక్తులకు ధారాదత్తం చేస్తున్నారని తెలిపారు. స్వాతంత్య్రం వచ్చి 76 ఏళ్లయినా నేటికీ ఉపాధి లేక యువతీయువకులు అనేక అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అల్లూరి బాటలో యువతీ యువకులు ఉపాధి కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు వై.రాము, అల్లూరి ప్రజాసంఘాల అభివృద్ధి వేదిక అధ్యక్షులు భూపతి అప్పారావు, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

మునగపాక : మండలంలోని తిమ్మరాజుపేట గ్రామంలో టిడిపి నాయకులు మంగళవారం అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగాపా పార్టీ నాయకులు మాట్లాడుతూ బ్రిటిష్ పాలకులపై తిరుగు బావుట ఎగరేసిన మన్యం పులి అల్లూరి సీతారామరాజు అని పేర్కొన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆడారి మంజు, భీమరశెట్టి శ్రీనివాసరావు, దాడి ముసలి నాయుడు, మొల్లేటి సత్యనారాయణ, సూరిశెట్టి రాము, ఆడారి నాగ సత్యనారాయణ, బివి రమణ, భాస్కర్,


నర్సీపట్నంలో నివాళి అర్పిస్తున్న అప్పలరాజు

రామచంద్రరావు, పరమేష్, అప్పారావు పాల్గొన్నారు.

పద్మనాభం : పద్మనాభం మండలం పాండ్రంగి గ్రామంలో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి మాజీ మంత్రి ఆర్ఎస్‌డిపి అప్పలనరసింహరాజు పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. పాండ్రంగి గ్రామంలోని అల్లూరి పార్క్ వద్ద ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్ఎస్‌డిపి అప్పలనరసింహరాజు మాట్లాడుతూ, అల్లూరి జీవిత చరిత్ర వివరించారు. ఈ కార్యక్రమంలో మహంతి అప్పలరమణ, పి.వెంకటరావు, బి.సంతోష్, కె.రమణ, పిన్నింటి శేఖర్, బూర్లె సత్యం, బర్నాల శ్రీను, పి.రామకృష్ణ, భోజరాజు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మధార : సీతమ్మధారలోని అల్లూరి సీతారామరాజు విగ్రహానికి రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు, ఉత్తర నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె రాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చొక్కాకుల వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మధారలోని అల్లూరి సీతారామరాజు విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులు లక్కరాజు రామారావు (ఉత్తరం), గుత్తుల శ్రీను (పశ్చిమం), భగత్ పిరిడి (పెందుర్తి), డిసిసి అధ్యక్షులు వజ్జాపర్తి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జగన్, పరదేశి సతీష్, శేషం శ్రీనివాస్, శివకుమార్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మధురవాడ : జివిఎంసి 7వ వార్డు పరిధి స్వతంత్ర నగర్ కాలనీలో ఉన్న అల్లూరి విగ్రహానికి పౌర సంక్షేమ సంఘం అధ్యక్షులు నాగోతి సూర్యప్రకాశరావు పూలమాలవేశారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు జగన్మోహన్ చౌదరి, పాద వెంకటరమణ, పోలిశెట్టి నాగేశ్వరరావు, పాపారావు, డాక్టర్ నాగ భూషణ్ నాయుడు పాల్గొన్నారు.


పాండ్రంగిలో నివాళి అర్పిస్తున్న మాజీ మంత్రి


ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ఉద్యోగులు

ప్రశాంతంగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలో రెండవ రోజు మంగళవారం పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రశాంతంగా జరిగింది. నక్కపల్లి తహసిల్దార్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయం లోనూ ఫెసిలిటేషన్ సెంటర్లను ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో ఉద్యోగులు తరలివచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటు వేసేందుకు ఉద్యోగులు బారులు తీరారు.

పోస్టల్ కేంద్రాలను సందర్శించిన అనిత

నక్కపల్లి:పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ కేంద్రాలను పాయకరావుపేట నియోజకవర్గం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత మంగళవారం సందర్శించారు. స్థానిక తహసిల్దార్, మండల పరిషత్ కార్యాలయంలోనూ ఫెసిలిటేషన్ సెంటర్లను ఆమె సందర్శించి నాయకులతో మాట్లాడారు. ఓటింగ్ జరుగు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నక్కపల్లి, పాయకరావు పేట పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, పెద్దిరెడ్డి చిట్టిబాబు, నాయకులు కొప్పిశెట్టి బుజ్జి, మెరుగు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు..

రాజగోపాలపురంలో తాగునీరు సరఫరా

- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి -కోటవురట్ల:మండలంలో కైలాసపట్నం శివారు గిరిజన గ్రామమైన రాజగోపాలపురంలో తాగునీటి ఇబ్బందులపై ఆదివారం ప్రజాశక్తిలో వచ్చిన వార్తకు సచివాలయ సిబ్బంది స్పందించారు. ఈ మేరకు మంగళవారం సచివాలయ కార్యదర్శి సంతోష్ లక్ష్మి తాగునీటి సరఫరాకు ఏర్పాట్లు చేశారు. దీంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఇన్చార్జి ఈఓపిఆర్డి స్వామి నాయుడు మాట్లాడుతూ, మండల వ్యాప్తంగా తాగునీటి సమస్యపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని సిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు. గ్రామస్తులకు తాగునీటి, పారిశుధ్యం పై ఎటువంటి అసౌకర్యం లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామన్నారు.


నీటిని పట్టుకుంటున్న మహిళ

గ్రామాల్లో పోలీసు కవాతు

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:ఓటు హక్కును ధైర్యంగా వినియోగించుకోవాలని నర్సీపట్నం టౌన్ సిఐ కాంతికుమార్ సూచించారు. మంగళవారం నర్సీపట్నం మున్సిపాలిటీలోని శివపురం, గచ్చపువీధి, ఐదు రోడ్ల జంక్షన్, పీనారిపాలెం ఏరియాల్లో సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ, ఎన్నికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ తమ ఓటును నిర్భయంగా వేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఎస్సైలు పాల్గొన్నారు.

నక్కపల్లి:సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా ప్రజలు సహకరించాలని సిఐ విజయ్ కుమార్ కోరారు. మండలంలోని జి.జగన్నాథపురం, ముకుంద రాజుపేట, గుల్లిపాడు, చినదొడ్డిగల్లు గ్రామాల్లో మంగళవారం సాయంత్రం పోలీస్ కవాతు నిర్వహించారు. ఈనెల 13న సార్వత్రిక ఎన్నికలు శాంతియుత వాతావరణంలో జరిగే విధంగా అందరూ సహకరించాలన్నారు.ఓటర్లు భయ భ్రాంతులకు లోను కాకుండా స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు.



నక్కపల్లి మండలంలో కవాతు చేపడుతున్న పోలీసులు


బురదలో కూరుకుపోయిన బస్

ఆర్‌టిసి బస్‌కు తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - చింతపల్లి: చింతపల్లి - నర్సీపట్నం ప్రధాన రహదారి కొలపరి పెద్దగడ్డ గ్రామాల సమీపంలో ఏపీఎస్ఆర్టీసీ బస్సు జాతీయ రహదారి బురదలో ఇరుకున్న ఘటన మంగళవారం చోటుచేసుకుంది. సోమ, మంగళవారాలలో కురిసిన వర్షానికి ఎన్‌హెచ్ 516ఏ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా ఎర్రమట్టి బురద మయమై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. చింతపల్లి నర్సీపట్నం టూ స్టాప్ బస్సు చింతపల్లి నుంచి నర్సీపట్నం వెళుతుంది. కొలపరి సమీప రహదారి బురదలో ఇరుక్కొని సుమారు 30 అడుగులు దూరం జారుకుంటూ పోయింది. ఈ సంఘటనతో బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. బస్సు డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి బస్సును భారీ వృక్షం వద్ద నిలుపుదల చేయడంతో పెను ప్రమాదం తప్పింది. దీంతో, ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. జాతీయ రహదారి యజమాన్యం స్పందించి రెండు జెసిబి ల సహాయంతో బస్సును సురక్షితంగా రహదారిపైకి తీసుకొచ్చారు.


పార్టీలోకి ఆహ్వానిస్తున్న రాజేష్

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని సిహెచ్.ఎర్రవరం పంచాయతీకి చెందిన వార్డు మెంబర్ సియాద్రి చిరంజీవి, వాలంటీర్ మొల్లేటి చిరంజీవి, అనిమిరెడ్డి తాతబాబు, ఎన్నేటి రాజారావు, ఎన్నేటి బాబూరావుతో పాటు ఐదు కుటుంబాలు వైసిపి నుండి టిడిపిలో చేరాయి. ఈ సందర్భంగా కౌన్సిలర్ రాజేష్ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ వైసిపి పాలన విధానాలకు విసుగు చెంది టిడిపిలో చేరుతున్నారన్నారు.



గణపతినగర్‌లో ప్రచారం చేస్తున్న గణబాబు

గణపతినగర్‌లో గణబాబుకు స్వాగతం

ప్రజాశక్తి -గోపాలపట్నం : జివిఎంసి 89వ వార్డు పరిధి గణపతినగర్, అప్పలనరసింహనగర్ కాలనీ, కొత్తపాలెం తదితర ప్రాంతాల్లో టిడిపి, జనసేన నాయకులతో కలిసి కూటమి అభ్యర్థి పెతకంశెట్టి గణబాబు ప్రచారం నిర్వహించారు. అయా గ్రామాల్లో ప్రజలు గణబాబుకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మీరు చూపిస్తున్న ఆదరాభిమానం ఎన్నటికీ మర్చిపోలేనన్నారు. ఇక్కడ సమస్యలన్నీ తనకు తెలుసని, కూటమి అధికారంలో రాగానే వాటిని పరిష్కరించేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ దాడి వెంకటరమేష్, వార్డు అధ్యక్షుడు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పద్మనాభంలో హోమ్ ఓటింగ్

ప్రజాశక్తి -పద్మనాభం : ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంపొందించేందుకు ఏర్పాటుచేసిన హోమ్ ఓటింగ్ కార్యక్రమం మంగళవారం బుధవారం కొనసాగుతుందని పద్మనాభం తహశీల్దార్ వెంకట్రావు తెలిపారు. మండలంలోని 22 గ్రామ పంచాయితీలో 111 మంది వృద్ధులను గుర్తించి వారి ఓటు కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటుచేశారు. మంగళవారం 42 మంది హోమ్ ఓటింగ్‌ను పూర్తి చేశారు. బుధవారం కూడా ఈ కార్యక్రమం కొనసాగుతుందని ఆయన తెలిపారు. వర్షం వల్ల ఈ కార్యక్రమం ఆలస్యమైందని వివరించారు.

'పశ్చిమం'లో వైసిపి బైక్ ర్యాలీ

ప్రజాశక్తి -యంత్రాంగం

గోపాలపట్నం : జివిఎంసి 91, 92 వార్డుల్లో వైసిపి మండల అధ్యక్షులు బెహరా భాస్కరరావు ఆధ్వర్యాన పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ సుమారు 1000 బైకులతో ర్యాలీ నిర్వహించారు. 92వ వార్డు పరిధి మేఘాద్రి గెడ్డ శ్రీ ఆంజనేయ స్వామి గుడి నుంచి పద్మనాభనగర్, ఎస్సీ, బీసీ కాలనీ, జనతా కాలనీ, కంపరపాలెం, వెంకటాపురం, నందమూరినగర్, సాయినగర్, అజంతా పార్క్ కాలనీ వరకు బైక్ ర్యాలీతో రోడ్ షో నిర్వహించారు. ఆర్ఆర్‌వి పురం, టైలర్స్ కాలనీ, బాపూజీ నగర్, రజక కాలనీ, శ్రీరామ్‌నగర్, ప్రశాంతినగర్, నాయుడు క్వార్టర్స్, రైల్వే స్టేషన్ రోడ్డు, నేతాజీ వీధి ప్రాంతాల్లో పర్యటించి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైసిపి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పేడాడ రమణి కుమారి, గునిశెట్టి శ్రీనివాసరావు, గొర్లె అప్పలస్వామి నాయుడు, గేదెల మురళీకృష్ణ, పాల్గొన్నారు.

వైసిపిలో చేరికలు

పశ్చిమ నియోజకవర్గం పరిధి 56వ వార్డు అధ్యక్షులు ఆడారి శ్రీను ఆధ్వర్యాన వార్డుకు చెందిన పలువురు యువకులు వైసిపిలో చేరారు. వీరందరికీ ఆడారి ఆనంద్‌కుమార్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. వైసిపి విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు సర్వసిద్ధి సాయిలత, ఎర్రికుమార్, ఎలమంచిలి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

వేపగుంట : పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్‌ను, విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీని గెలిపించాలని కోరుతూ 52వ వార్డులో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ఆధ్వర్యాన ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బిఎస్.కృష్ణ, జియ్యాని మారుతి పాల్గొన్నారు.



బైక్ ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఆనంద్‌కుమార్

అన్ని తరగతులకూ సముచిత స్థానం : కెకె.రాజు



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న కెకె.రాజు

ప్రజాశక్తి-సీతమ్మధార : వైసిపి పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సముచిత స్థానం లభించిందని ఉత్తర నియోజకవర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు అన్నారు. మద్రిపాలెం ఉడా కాలనీలోని కల్యాణ మండపంలో శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి కళింగ వైశ్య సేవా సంఘం సభ్యులు తాళాసు సాయిమోహన్ ఆధ్వర్యాన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైసిపిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 53వ వార్డు కార్పొరేటర్ బర్కత్ అలీ, నాయకులు గుజ్జు వెంకటరెడ్డి, అమర్ రెడ్డి, లాడి సత్యం, వారణాసి వెంకటరమణ, జామి శశి పాల్గొన్నారు.

వైసిపికి గౌడ కులాల మద్దతు

వైసిపికి గౌడ కులాలు మద్దతు ఇస్తున్నట్లు విశాఖ జిల్లా గౌడ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మెరువ గణేష్ తెలిపారు. ఉత్తర నియోజకవర్గంలోని కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గౌడల ఆర్థిక, రాజకీయ, సామాజిక అభివృద్ధి వైసిపి ప్రభుత్వం వల్ల జరిగిందన్నారు. గౌడలకు రాజకీయంగా ఐదు ఎమ్మెల్యే సీట్లును జగన్మోహన్‌రెడ్డి కేటాయించారని తెలిపారు. మంత్రి పదవి కూడా గౌడ కులాలకు వచ్చిందన్నారు. విశాఖ జిల్లాలో తాము ప్రతి గౌడ కుటుంబీకుల ఇంటికీ వెళ్లి వైసిపికి మద్దతుగా ప్రచారం చేస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యేగా కెకె.రాజును, విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దొమ్మేటి కృష్ణ, రాజశేఖర్, రవికుమార్, నక్క అనుదీప్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో పూర్తి సౌకర్యాలు

అధికారులకు జిల్లా కలెక్టరు రవి పట్టన్‌శెట్టి ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

ప్రజాశక్తి- అనకాపల్లి

జిల్లాలో వున్న పోలింగ్ కేంద్రాలలో పూర్తిస్థాయిలో సౌకర్యాలను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టరు, జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టన్ శెట్టి జిల్లా అధికారులు, నోడల్ అధికారులను ఆదేశించారు. ఈ విషయమై మంగళవారం కలెక్టరు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రంలో అవసరమైన కుర్చీలు, బల్లలు, విద్యుత్తు, తాగునీరు, ర్యాంపు, వీల్ ఛైర్, మరుగుదొడ్డి, పిడబ్ల్యు ఓటర్లకు సహాయకుడు విధిగా వుండాలని సూచించారు. నిరంతర విద్యుత్ సరఫరాకు జనరేటరును, నీడకు టెంటు ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ సిబ్బందికి ఎటువంటి ఇబ్బంది లేకుండా తగిన వసతి, టీ, అల్పాహారం, భోజన సదుపాయాలు కల్పించాలని సూచించారు. బిఎల్‌వో, అంగన్‌వాడి, మధ్యాహ్న భోజన నిర్వాహకుల ద్వారా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఇతరుల జోక్యం వుండరాదని, ఏర్పాట్లకు ముందుగా యాక్షన్ ప్లాన్ తయారు చేసుకోవాలని సూచించారు. జిల్లాలో వన్న 340 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని, పటిష్టమైన బందోబస్తు ఏర్పటు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్‌ఒ బి.దయానిధి, నోడల్ అధికారులు సుబ్బలక్ష్మి, కె.రమామణి, జిఎస్ డబ్ల్యుఎస్ అధికారి మంజులవాణి, డిఎమ్‌హెచ్.వో డాక్టర్ ఎ.హేమంత్, సిపివో జి.రామారావు, డిఆర్డిఏ పిడి శచీదేవి, డిఎస్‌ఓ కెవిఎల్ఎన్ మూర్తి, ఎపిఎమ్ఐపి డిడి జివి.లక్ష్మి, డిపివో ఆర్.శిరీషారాణి, స్త్రీశిశు సంక్షేమశాఖ పిడి అనంతలక్ష్మి, మత్స్యశాఖ డిడి పి.ప్రసాద్, పశుసంవర్థక శాఖ జెడి బి.ప్రసాద్ పాల్గొన్నారు.



పట్టుబడిన మద్యం బ్యాక్సులు ఇవే...

అక్రమంగా నిల్వ ఉంచిన
120 కేసుల మద్యం స్వాధీనం

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం మండలం నర్సాపురం రెవెన్యూ దుద్దుపాలెం బస్టాప్ వెనుక ఇటుక బట్టీ పాకలో అక్రమంగా నిల్వ ఉంచిన 120 కేసుల మద్యాన్ని ఫ్లయింగ్ స్క్వాడ్ పట్టుకుంది. సిఐ బి.శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ప్రకారం... ముందుగా అందిన సమాచారం మేరకు ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ నెంబర్-4 బి.సత్యంనాయుడు ఆధ్వర్యంలో దుద్దుపాలెం బస్టాప్ వెనుక ఉన్న ఇటుకుల బట్టీ పాకలో తనిఖీలు చేశారు. అక్రమంగా నిల్వ ఉంచిన 120 మద్యం బాక్సులు, విడిగా గోనెసంచిలో ఉన్న 78, మొత్తంగా 5,833 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఇటుకల బట్టీ యజమాని కడిమి వెంకటేష్‌ను పోలీసులు అరెస్టు చేశారు. పట్టుబడిన మద్యం విలువ సుమారు రూ.7 లక్షలు ఉంటుందని స్థానిక సిఐ బి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మద్యాన్ని గోవా రాష్ట్రం నుంచి తీసుకొచ్చినట్లు ప్రాథమిక దర్యాప్తులో తెలిసిందని చెప్పారు.

ఎన్‌టిపిసికి అపెక్స్ ఇండియా ప్లాటినం అవార్డు

ప్రజాశక్తి-పరవాడ

ఎన్టీపీసీ సింహాద్రి 2023 సంవత్సరానికి అపెక్స్ ఇండియా ఫౌండేషన్ ద్వారా అందించబడిన సిఎస్ఆర్ ఎక్సలెన్స్ విభాగంలో ప్రతిష్టాత్మకమైన ప్లాటినం అవార్డును సాధించింది. ఈనెల 4వ తేదీన ఢిల్లీలో జరిగిన వేడుకలో ఎన్‌టిపిసి సింహాద్రి యూనిట్ తరఫున డీజీఎం హెచ్ఆర్ మహాపాత్ర ఈ అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ అభివృద్ధి, స్థిరమైన పద్ధతుల పట్ల ఎన్టిపిసి సింహాద్రికి ఉన్న నిబద్ధతను ఈ ప్రశంస హైలైట్ చేస్తుందన్నారు. అపెక్స్ ఇండియా ఫౌండేషన్ వివిధ పరిశ్రమలలో కార్పొరేట్ సామాజిక బాధ్యతలో అత్యుత్తమ విజయాలు సాధించినందుకు ప్రసిద్ధి చెందిందని చెప్పారు. శ్రేష్టమైన కార్యక్రమాలు, విజయ నమూనాలను హైలైట్ చేయడం ద్వారా స్థిరమైన, సామాజిక బాధ్యత గల పద్ధతులను అవలంబించేలా సంస్థలను ప్రోత్సహించడం దీని లక్ష్యమని తెలిపారు. ఎన్టిపిసి సింహాద్రి విజయవంతమైన కార్యక్రమాలు ముఖ్యంగా విద్య, పర్యావరణ సుస్థిరత, ఆరోగ్యం, సంరక్షణ కార్యక్రమాలపై దృష్టి సారించి చుట్టుపక్కల కమ్యూనిటీలలో జీవన నాణ్యతను మెరుగుపరిచాయని చెప్పారు. ఈ ప్రయత్నాలు ఎన్టిపిసి సింహాద్రి నిర్వహిస్తున్న కమ్యూనిటీలకు మద్దతివ్వాలనే నిబద్ధతతో పనిచేస్తున్నట్లు తెలిపారు.



అవార్డు అందుకుంటున్న ఎన్‌టిపిసి సింహాద్రి డిజిఎం మహాపాత్రో

ఘనంగా అభయాంజనేయ స్వామి
ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండలం కేంద్రం కె.కోటపాడులో అభయాంజనేయ స్వామి దేవాలయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు ఉదయం నుండి అభయాంజనేయ స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. శ్రీ అభయాంజనేయ భవన నిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో మధ్యాహ్నం అన్న సమారాధన జరిగింది. రాత్రికి భజన కార్యక్రమాలు నిర్వహించారు.